# స్త్రీజాతిని గురించిన దుష్ప్రచారాలు

శ్రీ కొడవటిగంటి
కుటుంబరావుగారు

5 మార్చినాటి "ఆంధ్ర మహిళ"లో "చిత్రాలవల్ల స్త్రీలకి జరుగుతున్న అన్యాయం" అనే వ్యాసంపడింది. ఆడవాళ్ల అమాయికత్వాన్నీ, అసమర్థతనీ, అర్థంలేని సహనాన్నీ భారతీయ చిత్రాలు ప్రకటించి ప్రచారం చెయ్యటమేగాక ఆడవాళ్ల చురుకుతనాన్నీ, స్వాతంత్ర్యకాంక్షనీ, సంస్కారకాంక్షనీ తీవ్రంగా నిరసిస్తూ ఉంటున్నై. దీన్ని గురించి ఇదివరకే కొందరు వ్యాసాలు రాసి ఉన్నారు. కాని ఈ విషయమై తగినంత అలజడి జరగలేదు.

ఒక్క సినిమా చిత్రాలలోనే గాక దినదిన సాహిత్యంలోనూ, హరిదాసులు చెప్పే పిట్టకథల్లోనూ, శాసన చట్టాల్లోనూ, అనేక సాంఘిక నిబంధనల్లోనూ అనుక్షణమూ ఆడవాళ్ల కన్యాయం జరుగుతూనే ఉంది. ఇది సంఘమంతటా అల్లుకు పోయి జీవితంలో లోతుగా వేళ్లు వేసి ఉన్నముళ్లకంప.

ఇటువంటి దుష్ప్రచారం వెనక ఉండే మూలకారణాలు (ఆర్థిక-సాంఘిక దోపిడి వ్యాపారాలు) నూటికి తొంభైతొమ్మిది మంది గ్రహించరు, పట్టించుకోరు. వారు సాంఘిక వాతావరణాన్ని బట్టీ, మనస్తత్వాన్ని బట్టి నడుచుకుంటూ ప్రచారానికి మటుకేలొంగుతారు. ఉదాహరణకు, వైశ్యులను నాటకరంగంమీద ఎక్కించి ప్రజలచేత నవ్వింపజేస్తే ప్రజలు నవ్వుతారు. వారు నవ్వుతున్నారు గదా అని నాటక కర్తలు హాస్యంకోసం అటువంటి పాత్రలనే చిత్రిస్తారు. వైశ్యులు దాన్ని గురించి అలజడి చేసిన రోజు నుంచీ ఆ ఆచారం క్రమంగా అంతరిస్తుంది.

కనుక స్త్రీలు తమజాతికి జరిగే అన్యాయాన్ని ప్రచారం ద్వారాచాలావరకు అరికట్టుకో వచ్చును. స్త్రీ జాతికి సేవ చేయటానికి నడుము కట్టిన "ఆంధ్ర మహిళ" వంటి పత్రికలు స్త్రీలకి జరిగే అన్యాయాన్ని—సినిమాలైనాసరే, కథలైనా సరే, హరికథలైనా సరే—ఎప్పటికప్పుడు తీవ్రంగా విమర్శిస్తున్నట్టయితే ఆ అన్యాయం కట్టుపడటమే కాక స్త్రీ ఉన్నతికిగాను జరగదగిన యథార్థ సంస్కారానికి తగిన వాతావరణంకూడా ఏర్పడుతుంది. మహిళాభ్యుదయం ఆశయంగా పెట్టుకున్న ప్రతి పత్రికా తన ఆశయంతాలూకు దృష్టిపథంనుంచి జీవితాన్ని సర్వతోముఖంగా విమర్శించటం అత్యవసరం.

స్త్రీ సమస్యలు కేవలమూ స్త్రీలకి మాత్రమే సంబంధించిన వికావు. మార్క్సిస్టులు చెప్పినట్టు ఒకరిని నిర్బంధంలో ఉంచేవాళ్లు స్వేచ్ఛ అనుభవించ లేరు. అబిసీనియాలో రుణదాతలు బాకీదార్లని తమ చేతులకి కట్టేసుకుతిరుగుతారు. బంధితులు జైలులో బంధించబడి ఉంటే కాపలావాళ్లు బయట బంధించబడి ఉంటారు. బ్రిటిషుదారిద్ర్యానికి భారత దేశమే కారణం. ఆ విధంగానే ఆడవాళ్ల స్వాతంత్ర్య సమస్య మగవాళ్ల స్వాతంత్ర్య సమస్యతో లంకె వేసి ఉంది. స్త్రీలకి అన్యాయం చేస్తున్నవాళ్లు పురుషులకూడా అన్యాయం చేస్తున్నారు. మన చిత్రాల్లో చూపబడే ఆదర్శసతీమణులు పెళ్లాలుగా గలవాళ్ల పాట్లు పరమాత్ముడికెరుక !

★

## ఉగాది కట్నములు

శ్రీమతి కె. లక్ష్మీరఘురామ్, బి.ఏ. గారు, శ్రీమతి ఏ. పర్వతవర్ధనిగారున్నూ ఆంధ్ర మహిళా సభకు చెరి ఒకనూరు రూపాయల విరాళమిచ్చి, యావజ్జీవ సభ్యురాండ్రుగాచేరారు. ఈ సోదరీమణులు వెలిబుచ్చిన సాదర భావానికి, ఆంధ్ర మహిళా సభ కృతజ్ఞత తెలుపుకొనుచున్నది.

దుర్గాబాయి,
ప్రధాన కార్యదర్శిని, ఆంధ్ర మహిళా సభ.

ఆంధ్ర మహిళ
15-3-1945



http://www.maganti.org/

Source: A.P. Press Academy Website, Andhra Mahila Magazine - March 1945

Disclaimer: This topic/article/write-up has been posted here to increase the availability of some rare, forgotten and precious material for appreciation by a wider audience and with no intention what so ever of copy right violation.

Request for removal of any copyrighted material, by the owner, will be promptly complied with.

Maganti Vamsi Mohan